సాక్షి తిరుపతి

శుక్రవారం । 2 । జూన్ । 2023



హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరుగుతోంది. క్రీడాకారులు పరుగుల వర్షం కురిపిస్తున్నారు. - 8లో



హంస వాహనంపై జ్ఞానప్రదాత

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు హంస వాహనంపై ఊరేగుతూ కనువిందు చేశారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	28
చిత్తూరు	39	27
తిరుమల	36	24
గూడూరు	43	31
నగరి	41	28

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు చేనేత, జౌళిశాఖ, సహాయ సంచాలకులు వెంకటరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. 1-7-2023 తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరిలకు చెందిన వారు 15-23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, ఇంటర్మీడియెట్ వొకేషనల్ కోర్సు, ఐటీఐ పాసైన విద్యార్థులకు నేరుగా డీహెచ్‌టీటీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వెంకటగిరి కళాశాలలో 53 సీట్లు అందుబాటులో ఉన్నాయని, అదనపు సమాచారం కోసం 08625-295003, 9399936872, 9866169908, 9010243054లో సంప్రదించాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో వైఎస్సార్ యంత్రసేవా పథకం

తిరుపతి అర్బన్: వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు నుంచి ప్రారంభించనుండగా.. అదే సమయంలో కలెక్టరేట్‌లో కార్యక్రమం ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి 158 సీహెచ్‌సీ గ్రూపులకు 901 వ్యవసాయ పరికరాలను అందజేయనున్నారు. వాటిలో 74 ట్రాక్టర్లు ఉన్నాయి. మరో 42 రకాల పరికరాలు పంపిణీ చేయనున్నారు. రైతులకు పరికరాల కోసం రూ.13.68 కోట్లు ప్రభుత్వం హెచ్చించింది. అందులో రూ.4.58 కోట్లు సబ్సిడీ కింద అన్నదాతలు పొందనున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 80,284 మంది స్వామివారిని దర్శించుకోగా.. 34,096 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 205 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కపిలతీర్థంరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 43,001వ ర్యాంకు నుంచి 59 వేల ర్యాంకు వరకు పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు 205 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం 59,001 నుంచి 75 వేల ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్టు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

రేపటి నుంచి ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు

తిరుపతి అర్బన్ : ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న డీఆర్వో కోదండరామిరెడ్డి తెలిపారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ (ప్రకాశం భవనం)లో నిర్వహించనున్న పరీక్షలకు 577 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువస్తే అనుమతించమని స్పష్టం చేశారు.

జిల్లా రిజిస్ట్రార్ బదిలీ



పీవీఎన్ బాబు

తిరుపతి అర్బన్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన రెండేళ్లుగా జిల్లా రిజిస్ట్రార్‌గా తిరుపతిలో కొనసాగారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రార్‌గా పనిచేశారు. అంతేకాకుండా చిత్తూరు డీఆర్‌గా పనిచేశారు. ఈయన స్థానంలో ఒంగోలు జిల్లా రిజిస్ట్రార్ జి.శ్రీరామ్‌కుమార్ తిరుపతి జిల్లాకు బదిలీపై రానున్నారు. ఈమేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. రెండు రోజుల్లో కొత్త అధికారి బాధ్యతలు స్వీకరించనున్నారు.

రైతుకు భరోసా!



రైతు భరోసా మెగా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

'రైతుల సంక్షేమమే ధ్యేయం. వ్యవసాయాన్ని పండగ చేయడమే లక్ష్యం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాదిలో మొదటి విడత రైతు భరోసా..పీఎం కిసాన్ మొత్తాన్ని పంపిణీ చేస్తున్నాం. గ్రామస్థాయిలోనే రైతులకు వ్యవసాయ పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు ఇస్తున్నాం. అన్నదాతకు అన్ని వేళలా వెన్నుదన్నుగా ఉంటున్నాం..' అని నేతలు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గురువారం రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు.

అట్టహాసంగా రైతు భరోసా కార్యక్రమం

- చిత్తూరు జిల్లాలో 2,27,010 మంది రైతులకు లబ్ధి
- రూ.170.84 కోట్ల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సాక్షి, చిత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, గనులు భూగర్భశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం ద్వారా 2023 - 2024కు వరసగా ఐదో ఏడాది మొదటి విడత నిధులను గురువారం కర్నూలు జిల్లా, పత్తికొండ నుంచి సీఎం వైఎస్.జగన్ బటన్ నొక్కి ప్రారంభించగా.. అదే సమయంలో ఇక్కడి నాగయ్య కళాక్షేత్రంలో వర్చువల్ విధానంలో వీక్షించేందుకు జిల్లా స్థాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 51,10,194 మంది రైతులకు రూ.3923.18 కోట్లు, చిత్తూరు జిల్లాలో 2,27,010 మంది రైతులకు రూ.170.84 కోట్లను ముఖ్యమంత్రి రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గ్రామ స్థాయిలోనే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల ఈ- క్రాప్, రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ సగిలి షణ్మోహన్ మాట్లాడుతూ రైతులకు అందించే ఆర్థిక సహాయంలో సమస్యలుంటే సంబంధిత రైతులు రైతు భరోసా కేంద్రాల్లోనూ, స్పందన కార్యక్రమంలోనూ ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సమయానికి రైతులకు పెట్టుబడి కింద నిధులను విడుదల చేసి రైతులను ఆదుకుంటున్నారన్నారు. అంతకుముందు వ్యవసాయశాఖ అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జేసీ పి.శ్రీనివాసులు, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాయలసీమ జోనల్ చైర్మన్ శైలజారెడ్డి, చిత్తూరు నగర మేయర్ ఆముద, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి పాల్గొన్నారు.

ఆర్బీకేలు అద్భుతం



మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు ఆదిమూలం, కిలివేటి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తడ: నాడు విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, నేడు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో నిర్వహించగా.. దీనికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం తపన పడే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఉత్తుత్తి హామీలు ఇచ్చి పదవి దక్కగానే అన్నీ గాలికి వదిలేసే తత్వం చంద్రబాబుదన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ రైతులకే కాకుండా కుల, మతాలకు అతీతంగా పార్టీలతో పనిలేకుండా ప్రతి ఒక్కరికీ మేలు చేకూర్చేలా జగనన్న పాలన సాగుతోందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎస్.ప్రసాద్, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, ఎన్డీసీసీ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, తడ జెడ్పీటీసీ సభ్యులు ఇందుమతి కార్తీక్, తడ, నాయుడుపేట ఎంపీపీలు కే రఘురెడ్డి, కే ధనలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, తడ, తడకండ్రిగ సర్పంచ్‌లు కే ఆర్ముగం, తుమ్మాజయప్రద, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, ఎం మునీష్‌రెడ్డి, కే మాధవరెడ్డి, కోదండం, ఆర్‌కే సుందర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వర్షాలకు పంటలు దెబ్బతిన్న 1,110 మంది రైతులకు రూ.66.52 లక్షల మెగా చెక్కును, జిల్లాకు సంబంధించి రైతు భరోసా - పీఎం కిసాన్ పథకానికి అర్హులైన 2,27,010 మంది రైతులకు రూ.170.84 కోట్లు మెగా చెక్కును మీదుగా అందజేశారు. అలాగే జిల్లా అటవీ శాఖలో పనిచేసి మరణించిన ఏడుగురికి ఆయా కుటుంబాలకు జిల్లా అటవీశాఖ ద్వారా ఫారెస్ట్ బినేవొలెంట్ ఫండ్ కింద ఒక్కొక్కరికీ రూ.25 వేల చొప్పున రూ.1.75 లక్షలు పంపిణీ చేశారు.

గతంలో నగానట్రా తాకట్టు పెట్టేవాళ్లం



గతంలో పెట్టుబడి కోసం బంగారం తాకట్టు పెట్టేవాళం. అధిక వడ్డీలకు తెచ్చి వ్యవసాయం చేసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు వ్యవసాయం పండగగా మారింది. నాకు ఇప్పటి వరకు రూ.2,64,460 అందింది.

– పద్మావతి, మహిళారైతు, యాదమరి మండలం

మళ్లీ జగనే సీఎం



పాదయాత్రలో జగన్ రైతుల కష్టాలు చూసి అధికారంలోకి వచ్చాక వారికి మేలు చేస్తానని మాట ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతి సంవత్సరం రైతు భరోసా అందిస్తున్నారు. మాకు ఇప్పటికే రూ.54 వేలు వచ్చింది. ఈరోజు మళ్లీ రూ.7,500 వస్తుంది. మళ్లీ జగనే సీఎం.

– జయమ్మ, మహిళారైతు, కమ్మపల్లి



జిల్లా అటవీ శాఖలో పనిచేసి మరణించిన వారి కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ సగిలి షణ్మోహన్, డీఎఫ్‌వో



స్టాల్స్ పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్, డీఎఫ్‌వో

వ్యవసాయం లాభసాటి



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు వ్యవసాయ లాభం సాటిగా మారింది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు విద్యుత్ ఇవ్వడం, వ్యవసాయానికి పెట్టుబడిగా మే నెలలో రూ.7,500 ,అక్టోబర్‌లో మరో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు ఇవ్వడం చాలా సంతోషాన్నిస్తోంది. జగన్‌మోహన్ రెడ్డే పది కాలాలపాటు ముఖ్యమంత్రిగా ఉండాలి.

– ప్రతాప్‌రెడ్డి, చెర్లోపల్లి, చిత్తూరు మండలం

తెప్పపై సుందరరాజస్వామివారి అభయం



తెప్పపై విహరిస్తున్న సుందరరాజ స్వామి (ఇన్‌సెట్) విశేష అలంకరణలో ఉభయ దేవేరులు

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీసుందరరాజస్వామివారు తెప్పపై విహరించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీ సుందరరాజ స్వామివారి ముఖ మండపంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో స్వామివారు మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీసుందరరాజస్వామివారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. తెప్పోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీపద్మావతి అమ్మవారు తెప్పపై విహరించనున్నారు.

నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు తిరుపతి జిల్లా పరిధిలో 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు మొత్తం 7,849మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అన్నదాతకు అండగా నిలుద్దాం



భాకరాపేట సంత గేటుకు నగదు చెల్లిస్తున్న మోహిత్ రెడ్డి

భాకరాపేట : అన్నదాతకు అండగా నిలవడంలో ఉన్న సంతోషం ఎందులోనూ ఉండదని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. భాకరాపేట వారపు సంతలో గురువారం సాయంత్రం రైతులకు గేటు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ నోటికి ముద్ద అందించే రైతు సంతోషంగా ఉండాలన్నదే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సంకల్పమన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది దివంగత నేత వైఎస్సార్ ఆశయమన్నారు. ఆయన ఆశయ సాధనలో నడుస్తున్న జగనన్న స్ఫూర్తితో రైతుకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. వేలం పాట పాడిన గుత్తే దారుకు డబ్బు చెల్లించి రైతులు ఉచితంగా అమ్ముకునే సౌలభ్యాన్ని కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ సాకిరి భూపాల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, నాయకులు గురుశంకర్, నారాయణరెడ్డి, సీతాపతి, దాము తదితరులు పాల్గొన్నారు.

గజ ఘీంకారం.. తప్పని ప్రమాదం!



సహాయక చర్యల్లో సిబ్బంది



బర్డ్‌లో చికిత్స పొందుతున్న భక్తులను పరామర్శిస్తున్న టీటీడీ చైర్మన్



ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- గోవిందరాజస్వామి ఆలయంలో అపశ్రుతి
- రావిచెట్టు కూలి భక్తుడి మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- చెట్టుపడే ముందు ఘీంకారంతో గజరాజు పరుగు
- అప్రమత్తమైన భక్తులు
- లేకుంటే పెనుప్రమాదమే

తిరుపతి కల్చరల్: వాహన సేవలో తరించే గజరాజు ప్రమాదాన్ని ముందే పసిగట్టింది. భక్తులను కాపాడేందుకు ఘీంకారంతో హెచ్చరికలు జారీ చేసింది. ఆపై అక్కడ ఉన్న భక్తులు పరుగులు పెట్టే విధంగా వ్యవహరించి పలువురిని కాపాడింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయంశమైంది. బ్రహ్మోత్సవాల వేళ తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ ఆవరణలో రావిచెట్టు కూలి ఓ భక్తుడు మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన విషాదాన్ని మిగిల్చింది. స్థానికుల కథనం.. తిరుపతిలో గురువారం సాయంత్రం తీవ్ర స్థాయిలో గాలివీచింది. అదే సమయంలో గోవిందరాజస్వామి ఆలయ ఆవరణలోని రావిచెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. చెట్టుకిందే ఉన్న భక్తులు ప్రాణభయంతో పరుగులు తీశారు. కడపకు చెందిన రిటైర్డ్ డాక్టర్ గుర్రప్ప తప్పించుకోలేక చెట్టుకింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. నిహారిక, బేబి, చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, టీటీడీ ఫారెస్ట్ విభాగం సిబ్బంది అక్కడి చేరుకొని సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

ప్రమాదాన్ని పసిగట్టి..హెచ్చరికలు జారీచేసి!

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి వాహన సేవ ముందు కళాబృందాల ప్రదర్శనతోపాటు గజరాజులు వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా వాహన సేవ ప్రారంభానికి ముందు ఆలయ ఆవరణలోకి గజరాజును తీసుకొచ్చారు. ముందే ప్రమాదాన్ని పసిగట్టి..చెట్టు కూలే సమయంలో ఘీంకారం చేసింది. ఆపై పరుగులు తీసే యత్నం చేయగా.. అప్రమత్తమైన భక్తులు చాలా మంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

భక్తుడి మృతి బాధాకరం

చెట్టు కూలి భక్తుడు మృతి చెందడం బాధాకరమని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సంఘటనా స్థలాన్ని టీటీడీ చైర్మన్‌తో పాటు ఈవో ఏవీ.ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పరిశీలించారు. రిటైర్డ్ డాక్టర్ గుర్రప్ప మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని స్పష్టం చేశారు. గాయపడిన వారికి టీటీడీ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. అనంతరం బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులను పరామర్శించారు.

సంప్రోక్షణ

ఆలయ ఆవరణలో రావిచెట్టు ప్రమాదం నేపథ్యంలో అర్చకులు ఆలయ సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం రాత్రి స్వామివారి వాహన సేవ యథావిధిగా నిర్వహించారు. రాత్రి 7 నుంచి ఆరంభం కావాల్సిన స్వామివారి చంద్రప్రభ వాహన సేవ గంటన్నర పాటు ఆలస్యంగా నిర్వహించారు.

క్లుప్తంగా

క్లార్క్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా అవకాశం



వెంకటేష్‌ను అభినందిస్తున్న భారతీయులు

పెళ్లకూరు: అమెరికాలోని క్లార్క్ విశ్వవిద్యాలయంలో తెలుగు యువకుడు పేరం వెంకట్‌తేజకి అధ్యాపకుడిగా అవకాశం లభించడంపై హర్షం వ్యక్తమవుతోంది. పెళ్లకూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల కన్వీనర్ పేరం మధునాయుడు కుమారుడు వెంకట్‌తేజ బెంగుళూరులో ఎంసీఏ వరకు చదివాడు. అనంతరం 2021లో అమెరికా క్లార్క్ యూనివర్సిటీలో చేరి ఎంఎస్(మాస్టర్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ) పూర్తిచేశారు. అక్కడ విద్యనభ్యసిస్తూ 2022లో విశ్వవిద్యాలయంలో విద్యార్థి అంబాసిడర్‌గా కూడా పనిచేశారు. అక్కడ చదువుకునే రోజుల్లో స్కూల్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ విభాగంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం క్లౌడ్ కంప్యూటింగ్‌లో కొత్తగా కోర్సును రూపొందించి యూనివర్సిటీకి సమర్పించారు. దాంతో అక్కడి అధ్యాపకులు తొలిసారిగా యూనివర్సిటీలో వలస విద్యార్థికి బోధించే అవకాశం కల్పించారు. క్లార్క్ విశ్వవిద్యాలయం నిర్వాహకులు తాను చదివిన యూనివర్సిటీలోనే అధ్యాపకుడిగా నియమించడంతో వెంకట్ సంతోషం వ్యక్తం చేశఋూరు. 150 సంవత్సరాలు చరిత్ర కలిగిన యూనివర్సిటీలో మొట్టమొదటిగా భారత సంతతికి చెందిన వ్యక్తికి అరుదైన అవకాశం లభించింది.

హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్

- ప్రశాంత వాతావరణంలో క్రీడా పోటీలు
- మండల స్థాయి సెమీఫైనల్స్‌కు చేరుకున్న జట్లు
- అవార్డులు ప్రదానం చేసిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



విజేతలకు అవార్డులను ప్రదానం చేస్తున్న హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తలపెట్టిన చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరుగుతోంది. కొంత మంది యువత పరుగుల వర్షం కురిపిస్తూ బంతులను బౌండరీలు దాటిస్తున్నారు. గురువారం జరిగిన పోటీల్లో క్రీడాకారులు చక్కని ఆటతీరును కనబరుస్తూ.. ప్రేక్షకులను అలరించారు.

ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారం

విజేతగా నిలిచిన జట్లకు మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. రెండో లీగ్ దశ పోటీలు క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి. శుక్రవారం నుంచి మండల స్థాయి సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మండల వారీగా సెమీ ఫైనల్స్‌కు చేరిన జట్ల మధ్య పోటీలను నిర్వహించి, ఆయా మండలాల్లోని టీమ్‌లను అన్నింటికీ ఫైనల్స్‌కు ఆహ్వానం పంపించనున్నట్లు తెలిపారు.

10 గ్రౌండ్లలో 38 మ్యాచ్

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం నుంచి 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లను నిర్వహిస్తుండగా పలు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరడంతో 10 గ్రౌండ్లలో 38 మ్యాచ్‌లు నిర్వహించారు. ఉదయం 8, 11, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 3 గంటలకు మ్యాచ్‌లను ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వర్షం కారణంగా రెండు మ్యాచ్‌లు నిర్వహించలేక వాయిదా వేశారు. కాగా క్రికెట్ పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, టోర్నమెంట్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిల చేతులు మీదుగా ట్రోఫీలు అందించారు.



బ్యాటింగ్ చేస్తున్న క్రీడాకారుడు

చల్లని వాతావరణంలో..

తుమ్మలగుంట వేదికగా జరుగుతున్న క్రికెట్ పోటీలు మంగళవారం ఉదయం నుంచి నిప్పులు కక్కే ఎండలో ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నం 2 గంటల నుంచి వాతావరణం చల్లబడింది. క్రీడా మైదానం చుట్టూ వర్షం కురిసినప్పటికీ మైదానంలో మాత్రం చుక్క చినుకు లేదు. మ్యాచ్‌లకు ఎలాంటి అంతరాయం కలగలేదు. సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం ప్రారంభమవడం, అప్పటికే మ్యాచ్‌లు ముగియడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: దేశంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో రిక్రూట్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ తెలిపారు. కంబైన్డ్‌గ్రాడ్యుయేట్ స్థాయి లెవెల్ 2023 మే 9న జరిపిన గ్రూప్ సీకి సంబంధించిన ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ss.nic.in/sscfileserver/portal management/upoladedFiler/notice CHL09052023.odf వెబ్‌సైట్ ద్వారా rr.nic.in జూన్ 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,770
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,547
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,200
రిటైల్ వెండి గ్రాము	రూ.75.20

అలిపిరిలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ

- డిసెంబర్‌లో చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్

తిరుపతి తుడా: తిరుమల ఘాట్ రోడ్‌లో ప్రమాదాల కట్టడికిగాను అలిపిరి చెక్ పోస్ట్ వద్ద వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి కొండపైకి అనుమతించాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. అలిపిరి చెక్ పోస్ట్‌తోపాటు శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణాలు, శ్రీనివాస సేతు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..తిరుమలకు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడానికి అధునాతన యంత్ర పరికరాలు ఏర్పాటు చేసే అంశంపై నివేదిక అందించాలని సీవీఎస్‌వోను ఆదేశించామన్నారు. అలిపిరి చెక్ పోస్ట్‌లో వాహనాల తనిఖీలో ఆలస్యం జరిగి భక్తులు అసహనానికి గురికాకుండా ఉండడం కోసం వాహనాల తనిఖీ క్యూలైన్ల సంఖ్యను పెంచనున్నట్లు చెప్పారు. చెక్‌పోస్ట్‌లో విజిలెన్స్ సిబ్బంది బాగా తనిఖీలు చేస్తున్నారని, తిరుమలకు వాటర్ బాటిళ్లు తీసుకుని వెళ్లకుండా పటిష్టంగా తనిఖీలు చేయాలని సూచించారు. చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది చివర్లో సీఎం జగన్ ఈ ఆస్పత్రిని ప్రారంభిస్తారని చెప్పారు.

జూలైలో అందుబాటులోకి శ్రీనివాస సేతు

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు, తిరుపతి వాసుల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడం కోసం శ్రీనివాస సేతు నిర్మాణానికి టీటీడీ 65% నిధులు అందిస్తోందన్నారు. జూన్ చివరి నాటికి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి జూలైలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కాగా, గాలిగోపురం వద్ద ఉన్న దివ్య దర్శనం టోకెన్ల స్కానింగ్ కేంద్రాన్ని, గ్లోబల్ ఆసుపత్రి నిర్వహిస్తోన్న వైద్య కేంద్రాన్ని వైవీ పరిశీలించారు.

12న ఆత్మీయ సమ్మేళన సభ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ,ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన పుంగనూరులోని అంబేద్కర్ భవన్ సమీపంలోనున్న ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన సభను జయప్రదం చేయాలని ఆహ్వాన కమిటీ కన్వీనర్ మల్లారపు మధు పిలుపు నిచ్చారు. ఈమేరకు గురువారం ఆత్మీయ సమ్మేళన సభ ఆహ్వాన పత్రికలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ కల్లూరి నాగరాజుగౌడ్, సభ్యులు మునీంద్రనాయక్, పి.బాల, నాగేందర్, రాజశేఖర్, గిరిదర్, దామోదర్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన కునుకు!

నిద్రమత్తు ఆ కుటుంబాన్ని చిదిమేసింది. దైవ దర్శనాలకొచ్చిన ఒకే కుటుంబానికి చెందిన నలుగుర్ని మింగేసింది. ఆనందంగా జీవితాలను పంచుకుంటూ వెళ్లదీస్తున్న బంధుమిత్రులకు కన్నీళ్లు మిగిల్చింది. శ్రీకాళహస్తి–నాయుడుపేట జాతీయ రహదారి, మేర్లపాక చెరువు వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. నిద్ర మత్తే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

- మేర్లపాక చెరువు కట్ట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- బస్సును ఢీకొట్టిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- ఆలయాల దర్శనానికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు



కారులో అశోక్, చిన్నారి శాన్వితాక్షరి మృతదేహాలు



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



గాయపడ్డ చిన్నారి భాన్వితాక్షరి

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక చెరువు కట్ట వద్ద గురువారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం.. తెలంగాణ రాష్ట్రం, మహబూబాబాద్ జిల్లా, దంతాలపల్లి మండలం, దంతాలపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ(65)కు అశోక్(45), దినేష్(42), రాంబాబు(40) ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు దినేష్‌కు శాన్వితాక్షరి(4), భాన్వితాక్షరి(10) కుమార్తెలు ఉన్నారు. వెంకటమ్మ మూడు రోజుల క్రితం దంతాలపల్లి నుంచి తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి కుమారులు, కోడళ్లు, మనుమరాళ్లతో రెండు కార్లలో బయలుదేరారు. బుధవారం రాత్రి తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు. తర్వాత గురువారం ఉదయం టీఎస్26ఈ7432 మారుతీ బెలాన్‌లో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవడానికి వెంకటమ్మ కుమారులు అశోక్, దినేష్, రాంబాబు, మనుమరాళ్లు శాన్వితాక్షరి, భాన్వితాక్షరి, మరో కారులో కోడళ్లు, కుటుంబ సభ్యులతో తిరుపతి నుంచి బయలుదేరారు. వెంకటమ్మ చిన్న కుమారుడు రాంబాబు కారును నడుపుతున్నాడు. అదేసమయంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వస్తున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సును ఏర్పేడు మండలం, మేర్లపాక చెరువు కట్ట వద్ద ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటమ్మ, పెద్ద కుమారుడు అశోక్, చిన్న మనుమరాలు శాన్వితాక్షరి అక్కడికక్కడే మృతిచెందారు. రెండో కుమారుడు దినేష్, మనుమరాలు భాన్వితాక్షరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ దినేష్ మృతిచెందాడు. రాంబాబుకు స్వల్ప గాయాలయ్యాయి.

నిద్ర మత్తే కారణం

నిద్ర మత్తే రోడ్డు ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. రాంబాబు మూడు రోజులుగా తెలంగాణ నుంచి కారును నడుపుతున్నాడు. గురువారం నిద్ర మత్తుతో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్నట్టు చెబుతున్నారు.

ఉలిక్కిపడ్డ గ్రామస్తులు

మేర్లపాక గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. చెరువుకట్ట వద్ద ఘోర ప్రమాదం చోటు చేసుకోవడం.. క్షతగాత్రులు, మృతులతో పరిసరాలు నిండిపోవడంతో భయాందోళనకు గురయ్యారు.

హంస వాహనంపై జ్ఞానప్రదాత



హంస వాహనంపై జ్ఞాన ప్రదాతగా..

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సరస్వతీ దేవి అలంకరణలో హంస వాహనాన్ని అధిరోహించి గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శేష వాహనంపై వేణుగోపాలునిగా అభయమిచ్చారు. వేకువ జామున అర్చకులు నిత్యపూజాకైంకర్యాలు నిర్వహించారు. హోమశాలలో ప్రత్యేక పూజలను పూర్తి చేశారు. 7.30 గంటలకు పిల్లనగ్రోవితో వేణుగోపాలునిగా శేష వాహనంపై సుగంధ పుష్పాలతో, స్వర్ణాభరణాలను అలంకరించుకుని అధిష్టించారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పు,వాయిద్యాల నడుమ గోవింద నామ స్మరణలతో స్వామి వారి ఊరేగింపు సాగింది. ఆలయానికి చేరుకున్న వెంకన్న ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో పాల్గొన్నారు. సాయంత్రం పూజల అనంతరం స్వేతాంబరం, స్వర్ణాభరణాలతో సుందరంగా వీణను చేతబట్టి సరస్వతీ దేవిగా ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. తర్వాత రాత్రి హంస వాహనాన్ని అధిరోహించి జ్ఞాన ప్రదాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఏఈవో మోహన్, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం సింహ వాహన సేవ, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఎల్లకట్టవ మృతుల కుటుంబాలకు

రూ.5లక్షల ఆర్థిక సాయం



బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్

వరదయ్యపాళెం: మండలంలోని ఎల్లకట్టవలో అనధికారిక టపాకాయల తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ద్వారా సమాచారం అందుకున్న ముఖ్యమంత్రి కార్యాలయం తక్షణమే స్పందించి ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకంచింది. ఈ మేరకు కలెక్టర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ మేరకు గురువారం మధ్యాహ్నం కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం ఎల్లకట్టవకు చేరుకున్నారు. మృతి చెందిన నాగేంద్ర భార్య సుప్రియ, శంకరయ్య భార్య పోలమ్మ, ఏడుకొండలు భార్య శిరీషా పేరిట ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల నగదు చెక్కును అందజేశారు. అంతేకాకుండా దహన సంస్కారాలకు మరో రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనధికారికంగా టపాకాయల కేంద్రం నడుపుతున్న యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి దుర్ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. సహృదయంతో స్పందించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అన్నివిధాలుగా బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు భర్తను కోల్పోయిన సుప్రియకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తండ్రిని కోల్పోయిన కుమారుడికి ప్రభుత్వం ద్వారా ఉచిత విద్యను అందించి ఉద్యోగం కల్పించాలని, అలాగే సాగుభూమిని కేటాయించాలని స్థానికులు కొందరు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఎదుట ఆగ్రహంతో విన్నవించారు. మరికొందరు ఉద్దేశపూర్వకంగా అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని స్థానిక పోలీసులు నిలువరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బాధిత కుటుంబ సభ్యుల గురించి విన్నవించిన వినతులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, బీఎన్‌కండ్రిగ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యంరెడ్డి ఉన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా ఆత్మీయ సమావేశం ఈనెల 3న తిరుపతిలో జరగనుంది. సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సజ్జల భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహ సమావేశం గురువారం గ్రాండ్ రిడ్జ్‌లో నిర్వహించారు. జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బాలిశెట్టి కిషోర్, జిల్లా కోకన్వీనర్లు మైలాం శ్రీకాంత్‌రెడ్డి, వేలూరు రాకేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలాజీ యాదవ్, తిరుపతి కన్వీనర్ సర్వతేజ, వెంకటగిరి కన్వీనర్ గణేష్‌రెడ్డి, సత్యవేడు కన్వీనర్ కూరపాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రగిరి కన్వీనర్ సెంథిల్ కుమార్, తిరుపతి కో-కన్వీనర్లు సూరి, కొఠారి సుభాష్, రాజేష్, శ్రీకాళహస్తి కోకన్వీనర్ కేశవులు, వెంకటగిరి కోకన్వీనర్లు రమేష్ గౌడ్, ప్రవీణ్, సుబ్రమణ్యం సమావేశ నిర్వహణపై చర్చించారు. సమావేశానికి జిల్లాలోని సోషల్ మీడియా కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.